సాక్షి
పెద్దపల్లి

జీజీహెచ్‌లో పూలవేడుక

కోల్‌సిటీ: బతుకమ్మ ఆటాపాటలతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో సందడి నెలకొంది. వైద్యులు, సిబ్బంది సోమవారం రాత్రి బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, హెచ్‌వోడీలు, డాక్టర్లు, సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు. పాటలు పాడారు. నృత్యాలు చేశారు. వివిధ విభాగాల హెచ్‌వోడీలు అరుణ, తిరుమలేశ, లక్ష్మి, శిరీష, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.





మంగళవారం । 17 । అక్టోబర్ । 2023

న్యూస్‌రీల్

కనీస వేతనాలపై తీర్పు

జ్యోతినగర్(రామగుండం): 2021 జూన్‌లో విడుదల చేసిన ఐదు ఎంప్లాయిమెంట్ల కనీస వేతనాల జీవోను ఆరు వారాల్లోగా గెజిట్‌లో ప్రచురించేలా హైకోర్టు తీర్పు ఆర్డర్ కాపీ వెలువడిందని హెచ్‌ఎంఎస్ అనుబంధ ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల సంఘం ప్రధానకార్యదర్శి డి.సత్యం సోమవారం తెలిపారు. తీర్పు కాపీని హైకోర్టు సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ ద్వారా తాను అందుకున్నటు ఆయన పేర్కొన్నారు. అసంఘటిత రంగంలోని సుమారు 1.20కోట్ల మంది కార్మికులకు ఈ తీర్పుద్వారా ప్రయోజనం కలుగుతుంద పేర్కొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న డాక్టర్ వాసుదేవరెడ్డి

సుల్తానాబాద్(పెద్దపల్లి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య, విధాన పరిషత్ రీజినల్ కో ఆర్డినేటర్ వాసుదేవరెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సోమవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ, పేషెంట్లతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. విషజ్వరాలు ప్రబలుతున్నాయని, అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయని, ఈవిషయాన్ని పేషెంట్ల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగిందని అన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

జ్యోతినగర్(రామగుండం): ఈనెల 18న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌రావు, కొమ్ము గట్టయ్య సోమవారం తెలిపారు. ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో అండర్-14, 16, 18, 20లో బాలబాలికలకు వివిధ అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ కనబర్చిన 30 మందిని ఈనెల 25, 26 తేదీల్లో సూర్యాపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఆసక్తి గలవారు సంబంధిత పత్రాలతో ఈనెల 18న ఉదయం క్రీడా మైదానంలో హాజరుకావాలని కోరారు. వివరాలకు 94404 24640 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కలెక్టరేట్ కు 'న్యూ' లుక్



గోడలపై చిత్రాలు

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్ కొత్త అందాలు సంతరించుకుంది. సందర్శకుల దృష్టి ఆకర్షించేలా గోడలపై పెయింటింగ్ వేయించారు. జిల్లాలోని ప్రముఖ దర్శనీయ స్థలాలు, ఆలయాల ఫొటోలు తీసి గోడలపై ఏర్పాటు చేశారు. తాజాగా పురావస్తుశాఖ వస్తుసామగ్రిని ప్రదర్శించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం తేబుళ్లను సిద్ధం చేస్తున్నారు. రెండు, మూడురోజుల్లో పురావస్తు వస్తు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఇప్పటికే కలెక్టరేట్‌లో గార్డెన్‌ను సుందరంగా తీర్చిదిద్దిన విషయం తెలిసిందే.

జాతీయ పోటీల్లో ప్రతిభ



సర్టిఫికెట్లు అందుకుంటూ..

గోదావరిఖనిటౌన్: తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కరాటే ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్‌బీనగర్, కేకే గార్డెన్స్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పరీక్ష పోటీల్లో గోదావరిఖని ఒకినవా రెడ్‌డ్రాగన్ కరాటే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు మద్దెల కృతిక, మద్దెల అఖిల్ ప్రతిభ కనబర్చారు. కాయ్(కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా) జనరల్ సెక్రటరీ హాంషి రజనీశ్ చౌదరి విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

ఏఐసీసీ కార్యదర్శికి సన్మానం



శాలువాతో సన్మానిస్తున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రాహుల్‌గాంధీ పర్యటన రూట్ మ్యాప్ పరిశీలనకు గోదావరిఖని వచ్చిన ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరిని డీసీసీ అధ్యక్షుడు, రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా శాలువాతో ఆయనను సన్మానించారు. పార్టీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

తమ్మీ.. తొందరపడకు..

ఎన్నికల సమయంలో కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు అలకబూనడం సహజమే. వారిని బుజ్జగించాల్సింది అభ్యర్థులే. ఎంతచిన్న వ్యక్తి అయినా అభ్యర్థి స్వయంగా అలకబూనిన నేత వద్దకు వెళ్లి నేనున్నానని భరోసా ఇవ్వాల్సిందే.. 'కొల్లాపూర్ నుంచి జూపల్లి పోటీచేసినప్పుడు అక్కడ ఒక నాయకుడు అలకబూనారు. విషయం నాకు తెలిసి జూపల్లిని బుజ్జగించాలని కోరాను. కానీ 300 ఓట్లు ఉన్న ఆ నాయకుడిని నేను బుజ్జగించడం ఏమిటని జూపల్లి మాట్లాడలేదు. దీంతోనే జూపల్లి ఓడిపోయారు. కాబట్టి ఇలాంటి విషయాల్లో ఉదాసీనంగా ఉండొద్దు' అని అభ్యర్థులను సీఎం కేసీఆర్ ఇటీవల హెచ్చరించారు. ఎన్నికల సమయం కావడంతో విపక్షపార్టీల అభ్యర్థులు సైతం ఇదే ఫార్ములాను కొంచెం అటుఇటుగా అనుసరిస్తున్నారు. క్యాడర్ చేజారకుండా మంతనాలు సాగిస్తూ, బతిమాలుతూ మచ్చిక చేసుకుంటున్నారు.

- పార్టీలు మారే నేతలకు అభ్యర్థుల బుజ్జగింపులు
- గెలిచేది మనమే.. కండువాలు మార్చొద్దని విన్నపాలు
- బూత్‌లవారీగా, కొత్త ఓటర్లపై పార్టీల ఫోకస్



సాక్షి, పెద్దపల్లి: 'తమ్మీ.. వచ్చేది మన ప్రభుత్వమే.. గెలిచేది నేనే.. తొందరపడి పార్టీ మారకు.. నీకు ఏం కావాలో నాతో చెప్పు.. చేద్దాం' అని అన్ని పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు అలకపూనిన ద్వితీయ శ్రేణి నేతలను బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి, కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి, మరికొందరు బీజేపీలోకి వలస వెళ్తున్నారు. ఉదయం ఓ పార్టీలో చేరి.. సాయంత్రం సొంతగూటికి వస్తున్నారు.. సాధారణ కార్యకర్త నుంచి మొదలు కీలక నేతల దాకా కండువాలు మార్చేస్తున్నారు.

పైసలు ఇస్తావా.. పార్టీ మారాలా..!

- పార్టీలో అనేక ఏళ్లుగా పనిచేస్తున్నా. ప్రభుత్వం, పార్టీలో ఏ పదవులు రాలేదు. సంక్షేమ పథకాల్లో మేం సూచించిన వారికి ఇవ్వలేదని కొందరు, ప్రత్యర్థి పార్టీల ఆర్థిక ప్రలోభాలకు ఆకర్షితులై మరికొందరు కండువాలు మారుస్తున్నారు.
- జిల్లాలోని ఒక నియోజకవర్గంలో అయితే.. పార్టీ నుంచి పోయేవారు తప్ప వచ్చేవారు లేకపోవడంతో క్యాడర్ చేజారితే పార్టీ బలహీనపడుతుందనే భయంతో స్థాయిని బట్టి నజరానా ఇచ్చేస్తున్నారు.
- గెలుపే లక్ష్యంగా ఉన్నవాళ్లను కాపాడుకోవడం, ఇతర పార్టీల వారికి గాలం వేయడం, వదిలి వెళ్లినవారిని మళ్లీ సొంత గూటికి తెచ్చుకోవడం లక్ష్యంగా అన్నిపార్టీల నేతలు, అభ్యర్థులు వ్యూహాలను అమలు చేస్తున్నారు.

కొత్త ఓటర్లు.. లబ్ధిదారులపై నజర్

ఎన్నికల్లో ప్రతీఓటు కీలకమే. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఓటరు జాబితాపై సీరియస్‌గా దృష్టి సారిస్తున్నాయి. తమ నియోజకవర్గంలో ఆసరా, కల్యాణలక్ష్మి, రైతుబంధు తదితర సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా తయారు చేసుకుంటున్నాయి. లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రచారం కొనసాగిస్తున్నాయి. ఓవైపు ప్రచారం చేస్తూనే.. మరోవైపు తమకు అనుకూల, అనుకూలంకానీ ఓటర్ల వివరాలూ సేకరిస్తున్నాయి. ముఖ్యంగా కొత్తగా ఓటు నమోదు చేసుకున్నవారిని కలిసేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వారీగా, సానుభూతి ఓటర్ల సంఖ్యను లెక్కగడుతున్నాయి. ఇందుకోసం మండలాల వారీగా సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఓటరు జాబితాను ఆధారంగా చేసుకుని స్థానిక నాయకులు తమకు అనుకూలమైన ఓట్లను ప్రాథమికంగా నిర్ధారిస్తున్నారు. ముఖ్యంగా ఓటరు జాబితాను ప్రధాన పార్టీలు మూడు రకాలుగా విభజిస్తున్నాయి. అనుకూలమైన ఓట్లు, వ్యతిరేకమైన ఓట్లు, తటస్థంగా ఉండే ఓట్ల జాబితాను పోలింగ్ కేంద్రాల వారీగా రూపొందించటంలో స్థానిక నేతలు నిమగ్నమవుతున్నారు. అనుకూలమైన ఓట్లను కాపాడుకుంటూనే, వ్యతిరేకమైన ఓట్లను అనుకూలంగా మలుచుకోవాలని భావిస్తున్నారు. తటస్థ ఓటర్లను ఎలాగైనా చివరివరకూ ప్రత్యర్థి వర్గంవైపు జారిపోకుండా చూసుకుని తమవైపు తిప్పుకునే ప్రయత్నాలను చేస్తున్నారు. విపక్షాలు ప్రధానంగా కొత్త ఓటర్లపై ఫోకస్ చేసి, వారి ఓట్లను పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి.

గులాబీ ప్రచారభేరి!

- నేడు సిరిసిల్లలో ప్రజా ఆశీర్వాద సభ
- ఉమ్మడి జిల్లాలో రెండో శంఖారావం
- భారీ జనసమీకరణలో బీఆర్‌ఎస్ శ్రేణులు
- బైపాస్ రోడ్డులో వేదిక ఏర్పాటు



సభాస్థలి వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షిప్రతినిధి, కరీంనగర్/సిరిసిల్ల: బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. పార్టీకి, ఉద్యమానికి ఊపిరిలూదిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వరుససభలు నిర్వహిస్తూ తన కేడర్‌లో జోష్ నింపే ప్రయత్నంచేస్తోంది. ఆదివారం హుస్నాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం అయ్యింది. ఈక్రమంలో మంగళవారం సిరిసిల్లలో భారీ బహిరంగ సభ తలపెట్టింది. ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ నిర్వహించే రెండోభారీ ప్రచారసభ ఇదే కావడం గమనార్హం. సిరిసిల్ల ఎమ్మెల్యే, మంత్రి కె.తారకరామారావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కేంద్రంగా ఎన్నికల ప్రచార సభలో సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రసంగించ నున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సభ కోసం పదెకరాల స్థలాన్ని సిద్ధంచేశారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి నేరుగా సిరిసిల్లకు హెలీకాప్టర్‌లో చేరుకుని ప్రసంగిస్తారు. అనంతరం సిద్దిపేటలో జరిగే సభకు వెళ్లనున్నారు. సీఎం కేసీఆర్ తనయుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో తొలిసభ నిర్వహించడం విశేషం. 2009 నుంచి ఇప్పటి వరకు ప్రతీ ఎన్నికల్లో తనయుడి విజయం కోసం తండ్రి కేసీఆర్ బహిరంగ సభ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

భారీ జనసమీకరణకు ఏర్పాట్లు..

సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజాఆశీర్వద బహిరంగ సభ కోసం భారీగా జనాన్ని సమీకరించాలని బీఆర్‌ఎస్ పార్టీ వర్గాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఇప్పటికే మంత్రి కేటీఆర్ పార్టీ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశనం చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోనే ఎక్కువ మందిని సమీకరించాలని భావిస్తున్నారు. తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల నుంచి ఎక్కువ మందిని సమీకరించి సభను సక్సెస్ చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. 2018 నాటి ఎన్నికల ప్రచార సభను నిర్వహించిన స్థలంలోనే సభను ఏర్పాటు చేశారు. రెండుచోట్ల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. వంద మంది వీఐపీ కూర్చునేందుకు వీలుగా స్టేజీ ఏర్పాటు చేశారు.

గులాబీమయమైన సిరిసిల్ల..

సీఎం కేసీఆర్ పాల్గొనే సభ కోసం సిరిసిల్ల పట్టణాన్ని గులాబీ జెండాలతో అలంకరించారు. సిరిసిల్ల-కామారెడ్డి, సిరిసిల్ల-సిద్దిపేట, సిరిసిల్ల-వేములవాడ మార్గాల్లో రోడ్డుకు ఇరువైపులా కటౌట్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. సిరిసిల్ల నిండాగులాబీ జెండాలతో నిండిపోయింది.

హామీల జల్లు కురిసేనా..?

సీఎం కేసీఆర్ సిరిసిల్ల సభకు వస్తున్న సందర్భంగా ఈప్రాంత ప్రధాన సమస్యలపై సీఎం కేసీఆర్ హామీల జల్లు కురుస్తుందని ఆశిస్తున్నారు. మధ్యమానేరు జలాశయం పూర్తయినా.. గోదావరి జలాలు ఇంకా నర్మాల ఎగువ మానేరు, నిమ్మపల్లి మూలవాగు జలాశయాలకు చేరలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీలో భాగంగా మల్కపేట వరకు గోదావరి జలాలు చేరినా.. ఇంకా కొనసాగింపు పెండింగ్‌లోనే ఉంది. నేత కార్మికులను ఓనర్లను చేసే ×వర్కర్ టూ ఓనర్₹ పథకం ఇంకా అందుబాటులోకి రాలేదు. షెడ్లు నిర్మాణంలో ఉండగా.. లూమ్స్ ఇంకా ఏర్పాటుకాలేదు. వేములవాడలో రోడ్డు విస్తరణ, ఆలయ అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. వేములవాడలో మూలవాగుపై రెండో వంతెన నిర్మాణంలో ఉంది. పెద్దూరు వద్ద అపెరల్ పార్క్‌లో అభివృద్ధి, నేతన్నల కోసం యారన్ డిపో ఏర్పాటు, ఇల్లులేని వారికి గృహలక్ష్మి పథకం మంజూరు వంటి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా అభివృద్ధికి సీఎం కేసీఆర్ వరాల జల్లు కురిపిస్తారని ఆశిస్తున్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం

- 19న రాహుల్, ప్రియాంకాగాంధీ రాక
- పార్టీ నేతలు రోహిత్ చౌదరి, సుశాంత్ మిశ్రా, వేంనరేందర్‌రెడ్డి
- సభా ఏర్పాట్లు పరిశీలన



సభా ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నేతల రోహిత్ చౌదరి, సుశాంత్ మిశ్రా అన్నారు. ఈనెల 19న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో కాంగ్రెస్ అధినేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ పాల్గొనే బహిరంగ సభావేదిక ఏర్పాట్లను నాయకులు వేం నరేందర్‌రెడ్డి, విజయరమణారావుతో కలిసి వారు సోమవారం పరిశీలించారు. బీఆర్‌ఎస్ పాలన అవినీతి మయమైందని, కుటుంబపాలన సాగుతోందని వారు విమర్శించారు. సీఎం కేసీఆర్ అనుసరిస్తున్న విధానాలతో ప్రజలు విసుగుచెంది ఉన్నారని తెలిపారు. ఈసారి జరిగే ఎన్నికల్లో మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనతోనే మేలు కలుగుతుందనే విశ్వాసం ప్రజల్లో ఉందని వారు అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేశ్‌గౌడ్, సంపత్, మహేందర్, సారయ్య, ప్రకాశ్‌రావు, అన్నయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఫాం అందుకున్న కోరుకంటి



సీఎం నుంచి బీ ఫాం అందుకుంటున్న చందర్

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ సోమవారం సీఎం కేసీఆర్ నుంచి బీ ఫామ్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీఫామ్ అందుకున్న చందర్.. కేసీఆర్ ఆశీస్సులు తీసుకున్నారు.

మంథని నుంచి మధు..



బీఫామ్ అందుకుంటున్న పుట్ట మధు

మంథని: బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్ అందుకున్నారు. హైదరాబాద్ ప్రగతిభవన్‌లో ఆయన బీఫామ్ అందుకుని సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు.

హస్తినకు పోయినా.. తప్పని రిక్తహస్తం

జంగ్ తెలంగాణ



ర్యాలీలో సోమారపు సత్యనారాయణ, అనుచరులు

సాక్షి, పెద్దపల్లి: 'ఐనను పోయి రావలెయు హస్తినకు' అని భారతంలో రాయబారానికి వెళ్లేముందు శ్రీకృష్ణుడు పలికిన మాటలు రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ విషయంలో నిజమయ్యాయి. రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ మక్కాన్‌సింగ్‌కు ఖారారైనా.. చివరి ఆశతో ఢిల్లీ వెళ్లిన సోమారపు సత్యనారాయణకు భంగపాటు తప్పలేదు. కండువా కప్పుకుంటే టికెట్ ఇస్తామనే కాంగ్రెస్ పెద్దల ఫోన్‌కాల్‌తో శనివారం హస్తినకు వెళ్లిన సోమారపు సత్యనారాయణకు రిక్తహస్తమే ఎదురైంది. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. తన అనుచరులతో కలిసి సోమవారం గోదావరిఖనిలో బైక్ ర్యాలీ నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

నేడు బీజేపీ కండువా కప్పుకోనున్న కందుల?

బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడిన పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి ఆ పార్టీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. కానీ, తాజాగా బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరేందుకు యత్నించి భంగపడిన సోమారపు సత్యనారాయణ ఇండిపెండింట్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. దీంతో కందుల సంధ్యారాణి బీజేపీ అగ్రనేతల సమక్షంలో కాషాయ కండువా కప్పుకుంటారని తెలిసింది.

'స్వతంత్ర'ంగా ర్యాలీ

గోదావరిఖని: రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. గౌతమినగర్‌లోని తన నివాసం వద్ద ర్యాలీ ప్రారంభించారు. నాయకులు పిడుగు కృష్ణ, వడ్లూరి రవి, కోదాటి ప్రవీణ్, ప్రకాశ్, కుసుమకుమారి, రాజలింగు, కమలాకర్, డేవిడ్‌రాజు, దీటి వెంకటస్వామి, వీరన్న, మంచికట్ల భిక్షపతి పాల్గొన్నారు. కాగా, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తాననే ర్యాలీ నిర్వహించారని నిపుణులు వివరిస్తున్నారు.

టికెట్ల కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యం ఏది?

- వైఎస్సార్ హయాంలో మేనిఫెస్టోలో లేని పథకాల అమలు
- విజయరమణారావుకు ప్రగతిభవన్ నుంచి నిధులు
- హైదరాబాద్ 2024జూన్ దాకా ఉమ్మడి రాజధానియే
- మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు



గోనె ప్రకాశ్‌రావు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ ప్రతీ పార్లమెంట్ పరిధిలో రెండు స్థానాలను బీసీలకు కేటాయిస్తామన్న హామీని అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టికెట్ల కేటాయింపులో బీసీలను విస్మరించడాన్ని నిరసిస్తూ పెద్దపల్లి పట్టణంలో కొందరు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దసంఖ్యలో పార్టీ మారే అవకాశాలు ఉన్నాయని ఆయన జోస్యం చెప్పారు.

వైఎస్సార్ పాలన మరువలేనిది..

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరెడ్డి ఉచిత విద్యుత్, రుణమాఫీ పథకాల అమలుకే మేనిఫెస్టోలో ప్రాధాన్యం ఇచ్చినా.. అధికారంలోకి వచ్చాక 108, 104 వాహనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజారంజక పాలన అందించారని గుర్తుచేశారు.

ప్రగతిభవన్ నుంచి నిధులు..

పెద్దపల్లిలో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి విజయరమణారావు ప్రచార ఖర్చులకు ప్రగతిభవన్ నుంచి నిధులు వస్తున్నాయని గోనె ప్రకాశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి నిధులు లేవని ఆయన పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి అడ్డదారుల్లో అడ్డగోలుగా నిధులు సమకూర్చుకున్నారని, జాతీయ రాజకీయాల్లో అవకాశమిస్తే దేశమంతటికీ తానే ఖర్చు భరిస్తానని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. పెద్దపల్లిలో గతంలో ఓసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన అభ్యర్థి.. రెండుసార్లు ఓడినా తన ఆస్తులను ఏమైనా అమ్ముకున్నారా? అని ప్రశ్నించారు. ఆయనకు అధికార బీఆర్‌ఎస్ మంత్రులతో సత్సంబంధాలు ఉన్నాయని అన్నారు.

2024 జూన్ దాకా ఉమ్మడి రాజధాని హైదరాబాద్..

రాష్ట్రరాజధాని హైదరాబాద్ జూన్ 2024 దాకా ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు ఉమ్మడి రాజధానిగానే ఉంటుందని ప్రకాశ్‌రావు అన్నారు. మంత్రి కేటీఆర్ హైదరాబాద్ విషయంలో అవగాహన లేకుండా మాట్లాడారని విమర్శించారు. ఈ విషయంలో తప్పనిసరి పరిస్థితుల్లో గవర్నర్‌కు జోక్యం చేసుకునే అధికారం కూడా ఉందని ఆయన తెలిపారు.

లాభాల వాటా చెల్లించాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



వినతిపత్రం అందిస్తున్న బీఎంఎస్ నాయకులు

- కార్మిక సంఘాల డిమాండ్

గోదావరిఖని: సింగరేణి జారీచేసిన సర్క్యులర్ ప్రకారం కార్మికులకు లాభాల వాటా వెంటనే చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం అన్ని బొగ్గు గనులపై ఆందోళన నిర్వహించారు. ప్లకార్డులు ధరించి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు చెల్లించాల్సిన 32శాతం లాభాల వాటాను ఎన్నికల కోడ్ పేరుతో నిలిపివేయడం సరికాదన్నారు. ఈనెల 4న సర్క్యులర్ రాగా, ఎలక్షన్ కోడ్ ఈనెల 9న అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. అయినా ఎలక్షన్ కమిషన్ పేరుచెప్పి చెల్లింపులు వాయిదా వేయడం ఏమిటని నిలదీశారు. లాభాల వాటా కంపెనీ నిధుల నుంచే చెల్లిస్తున్నారని, ఈ డబ్బుతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల రాజారెడ్డి, మెండె శ్రీనివాస్, రాజమౌళి, గౌస్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ ఆధ్వర్యంలో..

బీఎంఎస్ ఆధ్వర్యంలో జీడీకే-2ఏ గనిపై ఆందోళన నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, నాయకులు ఆకుల హరీశ్, సాయివేణ సతీశ్, దాసరి సురేశ్, చాట్ల లక్ష్మయ్య, పెంచాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనులను స్మరించుకుందాం

- 21 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: పోలీసు అమరవీరుల త్యాగాలు అజరామరమని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఆన్‌లైన్ ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని అన్ని పోలీస్‌స్టేషన్లలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిషనర్ వివరించారు. ఆ వివరాలు ఇవే..

ఓపెన్‌హౌస్..

- ఓపెన్‌హౌస్ ద్వారా పోలీసు విధులు, త్యాగాలు, సాంకేతికత వినియోగం, ప్రజల రక్షణలో పోలీసుల సేవల గురించి ప్రజలకు తెలియజేస్తారు.
- 'సోషల్‌మీడియా దుర్వినియోగం అరికట్టడంలో పోలీసులపాత్ర' అంశంపై ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు.
- ఇందుకోసం ఈనెల 24వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి.
- ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి బహుమతులు అందజేసి, మరో ముగ్గురుని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు.
- కేటగిరీ-1లో కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ స్థాయి అధికారి వరకు 'పోలీసులకు పని -జీవిత సమతుల్యత' అంశంలో పోటీలుంటాయి.
- కేటగిరీ-2లో ఎస్సై స్థాయి అధికారి నుంచి ఆపైస్థాయి అధికారులకు సమాజంలో 'లింగ సమానత్వాన్ని కాపాడడం' లో పోలీస్ పాత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు.
- వ్యాసాలు 500 పదాలకు మించకుండా ఉండాలనే నిబంధన తప్పనిసరి చేశారు.
- ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి బహుమతులు అందిస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.
- రక్తదాన శిబిరాల నిర్వహణ, సైకిల్ ర్యాలీ, త్యాగమూర్తులకు నివాళి అర్పిస్తారు.

షార్ట్ ఫిలిం, ఫొటోగ్రఫీ పోటీలు

విద్యార్థులు, యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు షార్ట్‌ఫిలిం, ఫొటోగ్రఫీలో పోటీలు నిర్వహిస్తారు. ఇందులో పోలీసుల సేవలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో సేవలు, కీర్తి ప్రతిష్టలు తదితర అంశాలు ఉంటాయి. మూడు నిమిషాలకు తగ్గకుండా షార్ట్ వీడియోలు రూపొందించాలి. ప్రతిభ కనబరిచిన మొదటి మూడు ఫొటోలు, వీడియోలకు బహుమతు అందిస్తారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేస్తారు. ఫొటోలు, వీడియోలు ఈనెల 25వ తేదీలోగా స్పెషల్ బ్రాంచి కార్యాలయంలో అందించాలి.

కళాబృందాల ప్రదర్శన

ఈనెల 21 నుంచి 31వరకు పబ్లిక్ స్థలాల్లో పోలీసు అమరవీరుల త్యాగాలను వివరిస్తూ పోలీస్ కళాబృందాలతో పాటలు పాడిస్తారు. ఈనెల 21న పోలీస్ ఫ్లాగ్‌డే నిర్వహిస్తారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని పోలీసు కమిషనర్ కోరారు.

క్లుప్తంగా

మంత్రి కేటీఆర్‌కు శుభాకాంక్షలు


మంత్రిని అభినందిస్తున్న ఎమ్మెల్యే చందర్

రామగుండం: బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రకటనపై ఎమ్మెల్యే చందర్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు హైదరాబాద్‌లో ఐటీ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే సోమవారం కలిశారు. కార్మిక సంఘం ప్రతినిధి కౌశిక హరిత తదితరులు కలిసి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రామగుండం నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను భారీమెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు బహుమతిగా అందిస్తామని చందర్ అన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ బంద్


ఎంపీడీవో కార్యాలయంలో చీరలు

పెద్దపల్లిరూరల్: బతుకమ్మ పండుగ కోసం ప్రభుత్వం చేపట్టిన చీరల పంపిణీ ఎన్నికల కోడ్‌తో ఆగిపోయింది. పలు గ్రామాల్లో పంపిణీకి నోచుకోకుండా మిగిలిపోయిన బతుకమ్మ చీరలను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో భద్రపర్చాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆదేశించారు. చీరలన్నింటినీ ఇక్కడకు తరలించారు.

కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న మహిళా నాయకులు

గోదావరిఖని(రామగుండం): ఎన్నికల మేనిఫెస్టోలో మహిళల సంక్షేమానికి పెద్దపీట వేయడాన్ని హర్షిస్తూ సోమవారం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మూల విజయారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గాదం విజయ, కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవిత సరోజిని, రమ్యాయాదవ్, సమ్మెట స్వప్న, ముద్దసాని సంధ్యారెడ్డి, ప్రవంతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అసలు కెనాల్ వస్తదా.. రాదా?

- ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులను నిలదీసిన రైతులు


ఈఈని నిలదీస్తున్న రైతు

ధర్మారం(ధర్మపురి): 'అసలు కెనాల్ వస్తదా రాదా? స్పష్టం చేయండి' అని అధికారులను రైతులు నిలదీశారు. ధర్మారం మండలం పత్తిపాక గ్రామపంచాయతీలో ఎస్సారెస్పీ వరద కాల్వ నుంచి పత్తిపాక గ్రామం వరకు నిర్మించనున్న కాల్వపై సోమవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం జరిగింది. కాలుష్య నియంత్రణ అధికారి భిక్షపతి, ఈపీటీఆర్ఐలు భవాని, తాళ్ల రమేశ్, శ్రీనివాస్, సాహేద్ బేగం, ఈఈ శాంతన్‌ప్రసాద్, డీఈఈ శ్రీనివాస్ హాజరయ్యారు. అలాగే పత్తిపాక, మల్లాపూర్, నర్సింగాపూర్ గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పెద్దపల్లి ఆర్డీవో మదన్‌మోహన్ మాట్లాడుతూ.. కెనాల్ నిర్మాణంపై అపోహలు పెట్టుకోవద్దని అన్నారు. కెనాల్ నిర్మాణం గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలు కోరగా.. ఇలాంటి సమావేశాలు గతంలో ఎన్నోసార్లు నిర్వహించారని, ఎలాంటి ఫలితం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కెనాల్ నిర్మాణానికి శిలాఫలకం వేసి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. తాము భూసేకరణకు సహకరిస్తామని చెప్పినా కెనాల్ నిర్మించడం లేదని తెలిపారు. అనంతరం ఈఈ ప్రసాద్ మాట్లాడుతూ.. రామడుగు మండలం చిప్పగుర్తి గ్రామ శివారులోని వరద కాల్వ నుంచి రేవెల్లె కాకతీయ కాల్వ పత్తిపాక వరకు కెనాల్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. కెనాల్ నిర్మాణంలో మల్లాపూర్, పత్తిపాక గ్రామాలకు చెందిన దాదాపు 40 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. ప్రస్తుతం భూసేకరణ పనులు సాగుతున్నాయని వెల్లడించారు. ఈ బృహత్తరమైన ప్రణాళికతో రైతులకు సాగునీరందుతుందని వివరించారు. సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు బద్దం సుజాత, గందం వరలక్ష్మి, మాజీ సర్పంచ్ బంకుటం కొమురయ్య, రైతులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోపై ప్రచారం చేయండి

- పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత


మాట్లాడుతున్న ఎంపీ వెంకటేశ్ నేత

ధర్మారం(ధర్మపురి): ప్రజాసంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, ధర్మపురి ఎమ్మెల్యేగా కొప్పుల ఈశ్వర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత కోరారు. ఎర్రగుంటపల్లిలోని మహేశ్వర్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సీఎం కేసీఆర్ ప్రజాసంక్షేమం కోసం ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు బలరాంరెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పరి చంద్రయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల భేటీ


సమావేశంలో నాయకులు

రామగుండం: కాంగ్రెస్ అధిష్టానం రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థిగా మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌ను ప్రకటించడంతో గెలుపు కార్యాచరణను నాయకులు ముమ్మరం చేశారు. సోమవారం డీసీసీ అధ్యక్షుడి సోదరుడు ఠాకూర్ అయోధ్యసింగ్ అంతర్గాం మండలం ముర్మూర్, బ్రాహ్మణపల్లి, ఎల్లంపల్లి, టీటీఎస్ అంతర్గాం, గోలివాడ, మద్దిర్యాల, పొట్యాల తదితర గ్రామాల్లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయా గ్రామాల్లో దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి అభిమానులతో పాటు ఇందిరమ్మ ఇళ్లను పొందిన లబ్ధిదారులను కలిసి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరాలని నిర్ణయించారు. అలాగే బీఆర్ఎస్ ఇచ్చిన హామీలతో పాటు ప్రస్తుత మేనిఫెస్టో వైఫల్యాలు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తక్షణమే అమలు చేసే గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై చర్చించారు. మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, కొదురుపాక పవన్, మడ్డి తిరుపతిగౌడ్, గజెల్లి శంకర్, గోపు కొమురయ్యయాదవ్, గజ్జెల నాగరాజు, బల్వన్‌సింగ్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను మభ్యపెట్టడానికే హామీలు'


మాట్లాడుతున్న దుగ్యాల ప్రదీప్‌రావు

మంథని: కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ప్రజల్ని మభ్యపెట్టడానికి ఆచరణ సాధ్యంకాని హామీలు ఇస్తున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు విమర్శించారు. ఆ రెండు పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సోమవారం స్థానిక మహాలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పథకాలు పార్టీ కార్యకర్తలు, నాయకులకు తప్ప పేదలకు ఉపయోగపడవన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు వారంటీ లేనివని విమర్శించారు. సబ్బండ జాతులు, వర్గాలకు బీజేపీతోనే న్యాయం జరుగుతుందని తెలిపారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీని ఆదరించాలని కోరారు. మంథని నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని ఆరోపించారు. మంథనిలో బీజేపీ అభ్యర్థి కచ్చితంగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా ఇన్‌చార్జి రావుల రామ్‌నాథ్, మంథని మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు, కో కన్వీనర్ నాంపల్లి రమేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండపాక సత్యప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీధర్, కోశాధికారి దుర్గం తిరుపతి, అధికార ప్రతినిధి పోతారవేణి క్రాంతికుమార్, మహిళామోర్చా ప్రధాన కార్యదర్శి ఉడుముల విజయరెడ్డి, యువమోర్చా ప్రధాన కార్యదర్శి పగే రంజిత్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బండ మల్లారెడ్డి, బీఎస్ఏ ఇన్‌చార్జి చిలువేరి సతీశ్, బూడిద తిరుపతి, వీరబోయిన రాజేందర్, అజయ్ పాల్గొన్నారు.

నగదు పట్టివేత

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం పోలీసులు రూ.21,97,660 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎన్టీపీసీ రింగ్ రోడ్డు ఏరియాలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో గోదావరిఖని అడ్డగుంటపల్లికి చెందిన ఉత్తూరి నవీన్ వద్ద రూ.21,97,660 నగదు లభించింది. ఎస్సై బి.జీవన్, కానిస్టేబుల్ అంజి, శ్రీనివాస్ ఆ సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం ఫ్లయింగ్ స్క్వాడ్ టీం-3 (ఎఫ్ఎస్‌టీ) అధికారి త్రయంబకేశ్వరరావుకు అందజేశారు.

పన్నూర్ క్రాస్‌రోడ్డు వద్ద..


పట్టుకున్న నగదుతో సీఐ సతీశ్

రామగిరి:పన్నూర్ క్రాస్‌రోడ్డు వద్ద మంథని సీఐ సతీశ్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా పెద్దపల్లి మండలం చందపల్లి గ్రామానికి చెందిన వేల్పుల వెంకటేశ్‌ను తనిఖీ చేయగా రూ.6లక్షల నగదు లభించింది. దానికి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. రామగిరి ఎస్సై రవి ప్రసాద్ పాల్గొన్నారు.

టికెట్ ఇవ్వండి.. బరిలో ఉంటా..


దరఖాస్తు అందజేస్తున్న కొమురయ్యయాదవ్

జూలపల్లి/పెద్దపల్లిరూరల్: వైఎస్సార్‌టీపీ నుంచి పెద్దపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు టికెట్ కేటాయించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మ రాజయ్యయాదవ్ కోరారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్.రమేశ్‌కు ఉమ్మడి కరీంనగర్, మెదక్ జిల్లాల ఇన్‌చార్జీలు అనిల్‌కుమార్, లింగారెడ్డి సమక్షంలో దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ, పార్టీ తనకు టికెట్ కేటాయిస్తే బరిలో ఉంటానని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రిత్విక్‌రెడ్డి (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ శివారులో సోమవారం వేకువజామున గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో గుడిపాటి రిత్విక్‌రెడ్డి (26) దుర్మరణం పాలయ్యాడు. బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ కథనం ప్రకారం.. కాటారం మండలం దేవరాంపల్లికి చెందిన రిత్విక్‌రెడ్డి వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఆదివారం బైక్‌పై స్వగ్రామానికి వచ్చి తిరిగి సోమవారం వేకువజామున హైదరాబాద్‌కు పయనమయ్యాడు. రాఘవాపూర్ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించారు. మృతుడి తండ్రి గుడిపాటి సమ్మిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


చికిత్స పొందుతూ వృద్ధుడు..

గోదావరిఖని(రామగుండం): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ములుగూరి నర్సయ్య(55) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ సమ్మయ్య వివరాల ప్రకారం.. స్థానిక కాకతీయనగర్‌కు చెందిన నర్సయ్య ఈనెల 14న రాజేశ్‌టాకీస్ మెయిన్ రోడ్డు ముందు నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో లెనిన్‌నగర్‌కు చెందిన ఊట్ల రాకేశ్ ఆటోతో ఢీకొట్టాడు. ఈప్రమాదంలో నర్సయ్య తల, కుడికాలుకు గాయాలు కాగా గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్ తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న 2కిలోల గంజాయితో పాటు నలుగురు యువకులను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై మహేందర్ వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా నలుగురు యువకులు తిరుగుతున్నట్లు సమాచారం అందడంలో పోలీసు సిబ్బందితో వెళ్లి తనిఖీలు నిర్వహించారు. వారి వద్ద ఉన్న బ్యాగుల్లో 2 కిలోల డ్రై గంజాయి (దాదాపు రూ.50వేల విలువ) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయికి బానిసలైన యువకులు తాము సేవించడంతో పాటు ఇతరులకు అమ్మితే కొంత ఆదాయం వస్తుందనే ఆశతో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి కొనుగోలు చేశారని పేర్కొన్నారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన ఇంతియాజ్‌అలీ, గౌస్‌ఖాన్, బండి సాయిచరణ్, ఆకుల మిత్రచైతన్యను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ, కానిస్టేబుల్ శరత్‌ను ఏసీపీ మహేశ్ అభినందించారు.

ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన టిప్పర్


కాలువలో పడిన టిప్పర్

పాలకుర్తి(రామగుండం): మండలంలోని బసంత్‌నగర్ విమానాశ్రయం ప్రతిపాదిత స్థలం సమీపంలో మూలమలుపు వద్ద టిప్పర్ ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని జయ్యారం గ్రామ శివారు బండరాయి క్వారీల నుంచి నిత్యం కన్నాల క్రషర్స్‌కు లారీల ద్వారా బోల్డర్ సరఫరా జరుగుతుంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో పుట్నూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి టిప్పర్ బండరాళ్ల లోడుతో వస్తూ బసంత్‌నగర్ విమానాశ్రయం మూలమలుపు వద్ద అదుపుతప్పి ఎదురుగా ఉన్న ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో డ్రైవర్ లక్ష్మణ్‌కు గాయాలు కాగా, చికిత్స నిమిత్తం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. ప్రొక్లెయిన్ సహాయంతో టిప్పర్‌ను కాలువ నుంచి బయటకు తీశారు.

తరచూ ప్రమాదాలు.. స్పందించని అధికారులు

మూడునెలల క్రితం ఇదే స్థలంలో, ఇదే రీతిన బోల్డర్ టిప్పర్ కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడగా విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. గతంలోనూ ఇదే స్థలంలో వాహనదారులు కాలువలో పడిన ఘటనల్లో పలువురు గాయపడగా, నలుగురు దుర్మరణం చెందారు. రహదారిపై ఒక్కసారిగా మూలమలుపు ఉండటం, ఎలాంటి సైన్‌బోర్డులు లేని కారణంగా వాహనదారులు అదుపుతప్పి నేరుగా కాలువలోకి దూసుకెళ్తున్నారు. తరచూ ఇలాంటి ఘటనలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నా ఆర్అండ్‌బీ అధికారులు రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు, పోలీసులు స్పందించి వాహనాల వేగాన్ని నియంత్రించేలా స్థానికంగా స్పీడ్ బ్రేకర్, మూలమలుపును సూచించే సైన్‌బోర్డు, కెనాల్‌కు అడ్డుగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బొగ్గుబాయి వార్తలు

చల్లంగాచూడు తల్లీ


పూజలు నిర్వహిస్తున్న జీఎం దంపతులు

గోదావరిఖని(రామగుండం): శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఆర్జీ-2 ఏరియా వకీల్‌పల్లిగనిపై అమ్మవారి ఆలయంలో జీఎం ఎల్వీ సూర్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రోత్సవాల్లో రెండో రోజు గాయిత్రీదేవి అలంకారంలో ఉన్న దుర్గామాతను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉద్యోగులందరూ ఆయురారోగ్యలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ రవికిరణ్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, సంక్షేమాధికారి ఓంకారిబాబు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి


మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి(మంథని): సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే ఏర్పాట్లపై ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో సోమవారం జీఎం ఎస్.సుధాకర్‌రావు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 22న స్థానిక రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో వేడుకలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ప్రాజెక్టు అధికారులు ఎన్.రాధాకృష్ణ, కె.రాజేందర్, ఏరియా సేఫ్టీ అధికారి సీహెచ్ వెంకటరమణ, ఐఈ, సివిల్ డీజీఎంలు చంద్రశేఖర్, పద్మరాజు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఎస్ఎస్‌వో లక్ష్మీనారాయణ, డీవైపీఎంలు మారుతి, శ్రీహరి పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించాలి

- ఆర్జీ-2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ


మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని(రామగుండం): ఆర్జీ-2 ఏరియాలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించేలా చూడాలని జీఎం ఎల్వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం తన చాంబర్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఈనెల 20న యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌లో బతుకమ్మ సంబరాలతో పాటు ఫ్యామిలీ డే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఫ్యామిలీడే కార్యక్రమానికి కాలనీ, పోతనకాలనీ మహిళలు బతుకమ్మలతో అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో ఎస్ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, మెడికల్ సూపరింటెండెంట్ మహిపాల్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహ్మద్, సివిల్ ఎస్ఈ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా చెల్లించేలా చూడండి


వినతిపత్రం అందజేస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లించేలా చూడాలని కోరుతూ సోమవారం ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ హైదరాబాద్‌లో ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేశారు. ఎలక్షన్ కోడ్ పేరుతో ఆపివేసిన సింగరేణి లాభాల వాటా పంపిణీ వెంటనే చేపట్టాలన్నారు. కోడ్ ప్రకటన కంటే ముందే లాభాల వాటా ప్రకటన వచ్చిందని, ఈనెల16న చెల్లించాల్సిన లాభాల వాటా నిలిపివేయడం అన్యాయమన్నారు. దేశానికి వెలుగునిస్తున్న సింగరేణి కార్మికుల కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే లాభాల వాటా చెల్లించాలని కోరారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

రామగిరి(మంథని): సింగరేణి యాజమాన్యం వెంటనే లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీఎంఎస్ నాయకులు సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. స్థానిక డీస్పెన్సరీలో ఆర్జీ-3 డివిజన్ ఉపాధ్యక్షుడు ఆర్కాల ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపిన అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ డా. కళ్యాణ్‌చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. కార్మికులకు లాభాల వాటా అందజేయాలని లేకుంటే బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా ప్రతినిధి ఎర్రవెల్లి రాణి, పారామెడికల్ స్టాఫ్ నర్స్ శ్వేత, అనూష తదితరులు పాల్గొన్నారు.

ఖాతాల్లో జమచేయాలి

లాభాల వాటా వెంటనే కార్మికుల ఖాతాల్లో జమచేయాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు డిమాండ్‌చేశారు. ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన అనంతరం ఆయా గనుల మేనేజర్లకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, డీటీ రావు, సమ్మయ్య, గంగాధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు జీడీకే-8-ఏ గని ప్రమాదమృతుల వర్ధంతి

గోదావరిఖని: జీడీకే-8-ఏ గని ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల వర్ధంతి సభ మంగళవారం ఓసీపీ-3 సైట్ ఆఫీస్ స్థూపం వద్ద నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 20ఏళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో 10మంది కార్మికులు మృతి చెందారు. ఈసందర్భంగా స్థూపం వద్ద నివాళి అర్పిస్తారు.

అల్ఫోర్స్‌లో బతుకమ్మ సంబరాలు


బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): పూలను పూజించే గొప్ప సంస్కృతి మనదని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో నిర్వహించిన బతుకమ్మ, దసరా వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా మన పండుగలకు ప్రత్యేక గుర్తింపు ఉందని, పలు దేశాల్లో మన సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుందన్నారు. మన పండుగల విశిష్టతను తెలిపేందుకు, విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని నింపేందుకు పాఠశాలల స్థాయి నుంచే వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. అనంతరం దుర్గామాతకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, మహిళలు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబు గెలుపునకు కృషి చేయాలి


మాట్లాడుతున్న తిరుపతియాదవ్

రామగిరి(మంథని): కార్యకర్తలంతా కలిసికట్టుగా శ్రీధర్‌బాబు గెలుపునకు కృషి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రొడ్డ బాపు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ఇంటింటికీ తిరుగుతు ప్రచారం నిర్వహించలన్నారు. ప్రతి ఒక్కరూ 45 రోజులు కష్టపడి పనిచేసి పార్టీ బలోపేతానికి సైనికుడిలా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, పట్టణ అధ్యక్షుడు కాటం సత్యం, ఎంపీటీసీలు చిందం మహేశ్, కొప్పుల గణపతి, మండల కన్వీనర్ మహేశ్వర్‌రావు, ప్రచార కార్యదర్శి ముస్త్యాల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, మండల మహిళ అధ్యక్షురాలు రాధారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దాసరి శివ, సీనియర్ నాయకులు బొల్లపల్లి స్వామిగౌడ్, వనం రాంచందర్‌రావు, ఉడుత శంకర్, తీగల సమ్మయ్య, మట్ట రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.